సీఎం, సతీశ్‌జార్కి హొళిపై ఆరోపణలు

● తుమకూరు వాసి అరెస్టు

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య, ప్రజాపనుల శాఖ మంత్రి సతీశ్‌జార్కిహొళిలకు వ్యతిరేకంగా పలు ఆరోపణలు చేసిన తుమకూరు వాసిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మంత్రి సతీశ్‌జార్కిహొళి అభిమాని విజయ తళవార, బెళగావి మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈమేరకు తుమకూరుకు చెందిన మోహిత్ నరసింహమూర్తి(38)ని అరెస్టు చేశారు. తుమకూరు నుంచి బెళగావికి తరలించి కోర్టులో హాజరు పరిచారు.

వరిధాన్యం నీటిపాలు

ఫెంగల్ తుఫానుతో తీవ్ర నష్టం

కల్లాల్లోనే తడిసిపోయిన దిగుబడులు

ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు



8లో..

స్టార్టప్‌లలో కర్ణాటక వెనుకబడుతోంది

రామయ్య ఎవాల్యుయేట్‌లో

హెచ్చరించిన ప్రశాంత్ ప్రకాశ్

ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు కొత్త

ఆలోచనలతో ముందుకు రావాలి

7లో..



విశ్వేశ్వరయ్య కళాశాలను ఐఐటీ తరహాలో మారుస్తాం

150 మంది విద్యార్థులకు

రూ.50 లక్షల ప్రోత్సాహకాలు

ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్

7లో..



న్యూస్ బాక్స్

వారిద్దరే రాజకీయాలు చేసుకోనీ...

● మేమంతా ఎందుకు..?

● హోంమంత్రి అసంతృప్తి



బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార పంపిణీ విషయమై సీఎం, డీసీఎంలు ఇటీవల రెండు రోజులుగా వ్యాఖ్యానిస్తున్న తరుణంలో హోం మంత్రి పరమేశ్వర్ తీవ్రమైన ఆరోపణ చేశారు. రాష్ట్రంలో అధికార పంపిణీకి సంబంధించి ఒప్పందం జరిగిందనే విషయం నాకు తెలియదన్నారు. ఒప్పందం జరిగిందనేది వాస్తవమైతే వారిద్దరే రాజకీయాలు జరుపుకోవాలని ఇతరులు అవసరం లేదా.. అని ప్రశ్నించారు. సదాశివనగర్‌లోని నివాసం వద్ద గురువారం హోం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పదవి విషయంలో డీసీఎం, డీసీఎంల మధ్య ఒప్పందం జరిగి ఉంటే మేమంతా ఎందుకని, వారిద్దరే రాజకీయాలు చేసుకుంటే సరిపోతుందన్నారు. ఇదంతా జరగదని, అధిష్ఠానాన్ని వీడి వెళ్లేది లేదన్నారు. ఢిల్లీ పెద్దల తీర్మానాన్ని ఒప్పుకుంటామన్నారు. ఒప్పంద విషయం మాకు తెలియదన్నారు. ఇదే విషయమై ఢిల్లీతోపాటు రాష్ట్ర నాయకులు పలువురితో మాట్లాడానని ఎవరూ ఒప్పందం విషయం తెలియదనే చెప్పారన్నారు. డీసీఎం డీకే శివకుమార్ ఎందుకు అలాంటి వ్యాఖ్యలు చేశారో తెలియదన్నారు. సీఎం సిద్దరామయ్య అటువంటి ఒప్పందం జరగలేదని బహిరంగంగానే చెప్పారన్నారు. ఎన్నికలవేళ ప్రజలకు ఎలాంటి హామీలు ఇచ్చామో వాటిని నెరవేర్చాల్సిన కర్తవ్యం మాపై ఉందన్నారు.

బెంగళూరులో వాటర్ ట్యాంకర్ల మాఫియా

● రాజ్యసభలో మాజీ ప్రధాని దేవెగౌడ



బెంగళూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో తాగునీటి సమస్య ఉందని, వాటర్‌ట్యాంకర్ల మాఫియా నడుస్తోందని మాజీ ప్రధాని దేవెగౌడ రాజ్యసభలో ప్రస్తావించారు. గురువారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ నగరాలలో బెంగళూరు ఒకటిగా ఉందని, ఐటీ రాజధానిగా కొనసాగుతోందని, అయితే అక్కడ తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, శాశ్వత పరిష్కారం కోసం మేకెదాటు ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలన్నారు. నగరానికి ఉద్యోగాలకోసం దేశ విదేశీయులు వస్తున్నారని, ఇలా నగర జనాభా 1.45 కోట్ల మంది ఉన్నారన్నారు. ఏడాదికి 16 టీఎంసీల నీరు అవసరం కానుందన్నారు. ఇటీవల కొన్ని రోజులుగా ట్యాంకర్ల మాఫియా సాగుతోందని, సామాన్యజనం ఇబ్బంది పడుతున్నారన్నారు. బెంగళూరులో శాశ్వత నీటి పరిష్కారం కోసం మేకెదాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

కర్ణాటక వాహనాలను అడ్డుకుంటాం

● ఠాక్రే వర్గీయుల హెచ్చరిక

● మహామేళావ్‌ను అనుమతించండి

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బెళగావిలో 9వ తేదీన నిర్వహించే మహామేళావ్ నిర్వహించేందుకు మహారాష్ట్ర ఏకీకరణ సమితి (ఎంఈఎస్)కు అనుమతి ఇవ్వాలని, లేనిపక్షంలో తీవ్రమైన పోరాటం చేస్తామని శివసేన ఉద్ధవ్‌ఠాక్రే వర్గం సభ్యులు హెచ్చరించారు. బెళగావిలో మహామేళావ్‌కు అనుమతి ఇవ్వకపోతే మహారాష్ట్రలోకి కర్ణాటక వాహనాలను అడ్డుకుంటామన్నారు. ఈమేరకు మహారాష్ట్రలోని సరిహద్దు జిల్లా కొల్హాపుర అధికారికి బుధవారం వినతిపత్రాన్ని ఇచ్చారు. మూడునాలుగేళ్లుగా బెళగావిలో మహామేళావ్‌కు అక్కడి యంత్రాంగం అడ్డుకుంటోందన్నారు. మహారాష్ట్ర నుంచి ప్రజాప్రతినిధులు వెళ్లేందుకు అడ్డుకుంటారన్నారు. ఇదెక్కడి పరిణామమని ప్రశ్నించారు. శాసనసభ సమావేశాలు జరిగేవేళ కర్ణాటక ప్రజాప్రతినిధులు మహారాష్ట్రకు వస్తారని వారిని మేం అడ్డుకోవాల్సి వస్తుందని ఉద్ధవ్‌ఠాక్రే వర్గం సంజయ్‌పవార్, విజయ్‌దేవణె, విశాల దేవకులె, ధనాజి జవలి హెచ్చరించారు.

ఉత్సాహంగా జానపద సంబరం

విజయపుర, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర హోబళి వెంకటగిరి కోటె గ్రామంలోని గంగాభవాని దేవాలయ ఆవరణలో బుధవారం కన్నడ సంస్కృతిశాఖ, బెంగళూరు గ్రామీణ, సింధూర జానపద సాంస్కృతిక కళాసంస్థ సహకారంతో జానపద సంబరం 2024 కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. గ్రామపంచాయతీ సభ్యుడు ఆర్ అమరనాథ్ ప్రారంభించారు. సుగమ సంగీతం, జానపద గీత గాయనం, డొళ్ళుకుణిత, డప్పుల వాదన బృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. అమరనాథ్ మాట్లాడుతూ ఆధునికత, పాశ్చాత్య ధోరణితో మన సంస్కృతి సంప్రదాయాలను విస్మరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ధోరణి మారి మన సంస్కృతిని ప్రోత్సహించాలన్నారు. కర్ణాటక మాదిగ దండోరా రాష్ట్ర విభాగం ప్రచార సమితి అధ్యక్షుడు బుళ్ళహళ్ళి ఎం రాజప్ప మాట్లాడుతూ బతుకు సామరస్యాన్ని నేర్పే జానపద సాహిత్య రక్షణకు మనందరం కృషి చేయాలన్నారు. సింధూర జానపద సంస్కృతి కళాసంస్థ అధ్యక్షుడు మునిరాజు, గూడ్లు ముద్దేనహళ్ళి గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు జగదీశ్, ముదుగుర్కి మూర్తి, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.



జానపద సంబరంలో కళాకారులు

కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య





బీజేపీది జనద్రోహ పాలన

● పన్నులు కడుతున్నా... పేదలకు బియ్యం ఇవ్వరు

● హాసన్ ఆడపడుచుల కన్నీళ్లతో చేతులు కడుక్కున్నారు

● జనకల్యాణ సభలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

● సీఎం వెంటే ఉంటా: డీసీఎం డీకే శివకుమార్



సీఎంకు నాగలితో సత్కారం

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వానిది జనద్రోహ పాలన అని సీఎం సిద్దరామయ్య అన్నారు. కేంద్రానికి అత్యధికంగా రాష్ట్రం నుంచి పన్నులు చెల్లిస్తున్నామని, ఇక్కడి ప్రజలకు బియ్యం ఇచ్చేందుకు ఇబ్బంది పెట్టారని ఆయన మండిపడ్డారు. హాసన్‌లో గురువారం జనకల్యాణోత్సవ సభకు భారీగా జనం తరలివచ్చారు. డీసీఎం డీకే శివకుమార్, హోం మంత్రి పరమేశ్వర్, మంత్రులు రాజణ్ణ, మహదేవప్ప, కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సుర్జేవాలాతోపాటు పలువురు పాల్గొన్నారు. భారీ సభను ఉద్దేశించి సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ డాక్టర్ రాజ్‌కుమార్‌కు అభిమానులే దేవుళ్లు అని మాకు ప్రజలే దేవుళ్లన్నారు. ఇటీవల మూడు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించారన్నారు. హాసన్ మహానేత దేవెగౌడ మనవడు నిఖిల్‌ను, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై కుమారుడు భరత్‌బొమ్మైను కాదని కాంగ్రెస్ అభ్యర్థులకు ఆశీస్సులు అందించారన్నారు. కుమారస్వామికి ముఖ్యమంత్రి అయ్యేందుకు అవసరమైనన్ని సీట్లు రాష్ట్ర ప్రజలు ఎప్పుడూ ఇవ్వలేదన్నారు. కానీ కాంగ్రెస్, బీజేపీల సహకారంతో సీఎం అయ్యారని, ఆ తర్వాత రెండు పార్టీలను మోసం చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి సంపూర్ణమెజారిటీ సాధించామన్నారు. 2013లో సంపూర్ణంగా మద్దతు ఇచ్చారని అందుకు అనుగుణంగానే అన్నభాగ్య, క్షీరభాగ్యతోపాటు ఎన్నో పథకాలు అమలు చేశామన్నారు. బీజేపీ, జేడీఎస్‌లు ఇచ్చిన మాట ఎప్పుడూ నెరవేర్చలేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వానికి పన్నుల రూపంలో రాష్ట్రం నుంచి భారీగా నిధులు వెళ్తాయని, కానీ ఈ రాష్ట్ర ప్రజలకు బియ్యం ఇచ్చేందుకు కుట్ర పన్నారని, వారిది జనద్రోహి పాలన అన్నారు. మేం ఐదు గ్యారెంటీలకు 56వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని లబ్ధిదారులను బీజేపీ, జేడీఎస్‌లు ప్రజాదోహులు అన్నారన్నారు. కేంద్రంలో మంత్రిగా ఉండే కుమారస్వామి మేకెదాటు గురించి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బెంగళూరు నగరానికి తాగునీరు అందించే పథకానికి ఎందుకు నోరు తెరవరన్నారు.

మాజీ ప్రధాని దేవెగౌడ అంటే గౌరవం

మాజీ ప్రధాని దేవెగౌడ నాకంటే 15ఏళ్ల పెద్దవారని, ఆ గౌరవంతో మాట్లాడాలన్నారు. ఎప్పుడూ నేను గర్వంగా ప్రవర్తించలేదన్నారు. కానీ సిద్దరామయ్యకు గర్వభంగం చేస్తానని, ప్రభుత్వాన్ని కూల్చేవరకు నిద్రపోనని ప్రకటించడాన్ని ప్రజలు హర్షిస్తారా అని ప్రశ్నించారు. హాసన్ ఆడబిడ్డల కన్నీటితో చేతులు కడుక్కున్నారని దేవెగౌడ కుటుంబంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై భూమిపుత్రుడిగా చెప్పుకొనే కేంద్రమంత్రి కుమారస్వామి ఎందుకు ప్రశ్నించరన్నారు. రాష్ట్రానికి 11వేల కోట్ల రూపాయల అన్యాయంపై బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దేవెగౌడ రాజకీయంగా ఒక్కలిగ నాయకులను తొక్కిపెట్టారన్నారు, బచ్చేగౌడ, వైకే రామయ్య, కృష్ణప్ప, చలువరాయస్వామి ఇలా ఎంతోమందిని రాజకీయంగా ముగించారన్నారు. జాలప్పతో కలసి తాను రామకృష్ణహెగ్డేను మార్చి దేవెగౌడను సీఎం చేశానని, ఆ తర్వాత నన్నే పార్టీ నుంచి తొలగించారన్నారు. మరోసారి హాసన్ కాంగ్రెస్ కంచుకోటగా మారిందన్నారు. హాసన్‌లో తొలిసారి జరిగిన కాంగ్రెస్ జనకల్యాణ సభకు ఇంత భారీ స్థాయిలో జనం రావడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు సీఎం హెలిప్యాడ్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో ఓడిన బీజేపీ రాజకీయ నాటకాలు ప్రారంభించిందని, ప్రజలు నమ్మరన్నారు. వక్ఫ్‌పోరాటంపై మండిపడ్డారు. వక్ఫ్ ఆస్తుల అక్రమాలనుంచి రక్షణ కల్పించి వాపసు చేస్తామని బసవరాజ్‌బొమ్మై సీఎం అయ్యారన్నారు. కార్యక్రమంలో సీఎంను నాగలి బహూకరించి సత్కరించారు.



వేదికపై సీఎం, డీసీఎం, కాంగ్రెస్ నాయకులు

సీఎం సిద్దూ వెంటే ఉంటా: డీసీఎం డీకే శివకుమార్

సీఎం సిద్దరామయ్యకు అండగా నిలుస్తానని మైసూరులో ప్రకటించానని మరోసారి హాసన్‌లో చెబుతున్నా అని నిన్న... నేడు... రేపు... మాత్రమే కాదు ప్రాణంపోయేంతవరకు కలసి ఉంటానని డీసీఎం డీకే శివకుమార్ వెల్లడించారు. తాను ఎక్కడ పనిచేస్తానో అక్కడ ప్రామాణికతకు ప్రాధాన్యం ఇస్తానన్నారు. కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోయేలా ఏడాదిన్నర క్రితం శాసనసభ ఎన్నికల్లో ఫలితాలు ఇచ్చారన్నారు. ఉపపోరులోనూ ప్రజలు ఆశీర్వదించారన్నారు. హాసన్ చరిత్రను పరిశీలిస్తే బాధ కలుగుతుందని, ఎంతోమంది రాజకీయ నాయకులు, కుటుంబాలు కన్నీరు పెట్టుకున్నారన్నారు. దేవెగౌడ సొంతూరులో సభ పెట్టామని అంతకుముందు కొన్ని వాస్తవాలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ బలంతో దేవెగౌడ ప్రధాని అయ్యారని, కుమారస్వామి తొలుత బీజేపీతో కలసి 20 నెలలు, ఆ తర్వాత కాంగ్రెస్‌తో కలసి పాలన సాగించారని పేదలకు ఎటువంటి పథకాలు అందించారని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చినప్పుడు కన్నీరు పెట్టడం కాదని అధికారం దక్కినప్పుడు కన్నీరు తుడచాలన్నారు. ఉప ఎన్నికల వేళ చన్నపట్టణలో దేవెగౌడ, కుమారస్వామి మరో ఆరు నెలల్లో ఈ ప్రభుత్వం కూలిపోతుందని చెప్పారన్నారు. మాకు 138మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, మమ్మల్ని మార్చడం మీ తరంకాదని, 2028లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు.

రేవా స్టార్టప్ సభలో 35 కంపెనీల ప్రదర్శనలు

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యాసంస్థ రేవా యూనివర్సిటీలో స్టార్టప్ రౌండ్‌టేబుల్ 2024 సమావేశం జరిగింది. యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెంటర్ గురువారం ఏర్పాటు చేసిన సభలో భావితరాలకు అవసరమైన విభాగాలలో స్టార్టప్‌లను ఆవిష్కరించాలని న్యూమో సిటీ సీఈఓ, కో ఫౌండర్ రవికిరణ్ అణ్ణస్వామి, ప్రముఖ జ్యువెల్స్ సంస్థ జోస్ అలుక్కాస్ ఎండీ వర్గీస్ అలుక్కాస్ ముఖ్యులుగా పాల్గొన్నారు. రవికిరణ్ అణ్ణస్వామి మాట్లాడుతూ స్టార్టప్ ఎకోసిస్టమ్ అవకాశాలను వివరించారు. స్టార్టప్‌లు ప్రారంభించేందుకు ముందు సమాజానికి ఏ విధంగా ఉపయోగపడుతుంది, ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో ఎంతమేర విస్తారం సాధ్యం కానుందనేది తెలుసుకోవడం ముఖ్యమన్నారు. పెట్టుబడుల సేకరణ, కార్యాచరణ బలోపేతం చేయడం, స్టార్టప్ విజయవంతానికి కారణమన్నారు. వర్గీస్ అలుక్కాస్ మాట్లాడుతూ మనం నిత్యం చేసే వ్యవహారాలు స్టార్టప్‌కు అనుసంధానంగా ఉన్నాయన్నారు. వ్యవహారం ప్రగతికి ఐదు ప్రముఖ సూత్రాలు పాటించాలన్నారు. వ్యాపారాన్ని ఉత్సాహంగా పరిగణించాలని, ప్రగతిని సమర్థవంతంగా స్థిరత్వాన్ని పాటించాలని, వినియోగదారులకు అవసరమైన అంశాలను అర్థం చేసుకోవాలని ఆధునికతను రూపొందించుకోవాలని యుత సామర్థ్యాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రేవా యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ పీ శ్యామరాజు మాట్లాడుతూ యూఐఐసీ, యూనివర్సిటీ సాంకేతిక వ్యవహారాలకోసం ఇంక్యుబేటర్‌గా ఉండే నెస్టెన్ గురించి వివరించారు. వేలాదిమంది యువ విద్యార్థులకు ఉద్యోగాలు రూపొందించేందుకు ఓ మార్గదర్శకమన్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేసినవారు ఉద్యోగులు, స్టార్టప్ నిర్వాహకులు కావాలనేది మా ఆశయమన్నారు. 35కుపైగా స్టార్టప్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. రౌండ్‌టేబుల్‌లో 300కుపైగా స్టార్టప్‌లు ఎకోసిస్టమ్‌కు అనుబంధమైన వాణిజ్య పరిశ్రమలు నమూనాలను ప్రదర్శించారు. యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సంజయ్ ఆర్ చిట్నీస్, వైస్ ప్రొ వైస్ చాన్స్‌లర్ ఆర్‌సీ బిరాదార్ పాల్గొన్నారు.



ముఖ్య అతిథిని జ్ఞాపికతో సన్మానిస్తున్న చాన్స్‌లర్ శ్యామరాజు

పెళ్లికి ఒప్పుకోలేదని...

యువతి తల్లి, తమ్ముడి హత్య

బెంగళూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి యువతి కుటుంబ సభ్యులు అంగీకరించలేదని ఓ వ్యక్తి దారుణానికి ఒడిగట్టిన ఘటన బెళగావి జిల్లాలో చోటు చేసుకుంది. నిప్పాణి తాలూకా అక్కోళ గ్రామంలో ఇద్దరు దారుణహత్యకు గురయ్యారు. బుధవారం రాత్రి అక్కోళ గ్రామానికి చెందిన మంగళనాయిక (42) ఆమె కుమారుడు ప్రజ్వల్ నాయక (18)ను మారణాయుధాలతో దాడి చేసి హతమార్చిన వ్యక్తి పరారయ్యాడు. ఇందుకు సంబంధించి జిల్లా ఎస్పీ డాక్టర్ భీమాశంకర్‌గుళేద్ తెలిపిన మేరకు మంగళనాయిక కుమార్తెను పెళ్లిచేసి ఇవ్వాలని నిందితుడు రవి వేధించేవాడన్నారు. అయితే మంగళనాయిక మాత్రం తన కుమార్తెను ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. దీంతో రవి నేరుగా యువతి ఇంటికి వెళ్లి తల్లి, కుమారుడిని దారుణంగా హత్య చేశాడు. యువతి అక్కడ లేకపోవడంతో తప్పించుకుంది. నిందితుడు రవిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని యువతికి రక్షణ కల్పిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

ఏనుగుల కదలికలపై డ్రోన్ల నిఘా..!

● బెంగళూరు గ్రామీణ జిల్లాలో ప్రయోగాత్మకం

● రాష్ట్రమంతటా విస్తరణకు కసరత్తు


బెంగళూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): అటవీప్రాంతాల ఆక్రమణలు పెరిగిపోతుండడంతో వన్యప్రాణులకు తగిన ఆహార లభించక శివారుప్రాంతాలలోని ప్రజల నివాసాలు, పంట పొలాలవైపు చొచ్చుకు వస్తున్నాయి. రాష్ట్రంలో ఇటీవలికాలంలో ఏనుగులనుంచి పంట పొలాలకే కాకుండా కూలీ కార్మికులకు రక్షణ లేకుండా పోతోంది. తరచూ పంటపొలాలపై దాడులు చేసే ఏనుగులు చేతికొచ్చిన పంటను సర్వనాశనం చేస్తున్నాయి. మరోవైపు ఉదయం సాయంత్రం వేళల్లో రైతులు, కూలీ కార్మికులపై దాడిచేసి చంపేస్తున్నాయి. తరచూ ఏనుగుల దాడులు మైసూరు, రామనగర, బెంగళూరు గ్రామీణ, హాసన్‌తోపాటు వివిధ జిల్లాల్లో కొనసాగుతున్నాయి. ఏనుగుల దాడినుంచి రక్షణ కల్పించాలని రైతులు ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. బెంగళూరు గ్రామీణ జిల్లా పరిధిలో పంట పొలాలవైపు ఏనుగులు చొచ్చుకు వచ్చే విషయాన్ని ముందుగా గుర్తించేందుకు డ్రోన్ టెక్నాలజీ సముచితమని బెంగళూరు గ్రామీణ బీజేపీ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ అన్నారు. అందుకు అనుగుణంగా అటవీశాఖ అధికారులతో డ్రోన్ సాంకేతికతను ప్రయోగాత్మకంగా అమలు చేశారు. గ్రామీణ పరిధిలో బన్నేరుఘట్ట, కోడిహళ్లి, సాతనూరు, మాగడి, చన్నపట్టణతోపాటు పలు ప్రాంతాలలో ఏనుగులు పొలాలపై దాడుల విషయాన్ని ఎంపీ గుర్తించారు. అటవీశాఖ అధికారులతో చర్చలు జరిపి కోడిహళ్లి పరిధిలోని బొమ్మసంద్ర అటవీ ప్రాంతంలో డ్రోన్ సాంకేతికతను ప్రయోగించారు. ఇటీవల 25 ఏనుగులు అడవినుంచి పంట పొలాలవైపు వస్తుండడాన్ని గుర్తించారు. వెంటనే అటవీశాఖ అధికారులు రంగంలోకి దిగి కార్యాచరణ జరిపి ఏనుగులను అటవీప్రాంతాల వైపు మళ్లించారు.

ఏనుగుల కదలికలపై నిఘా..!

గడిచిన 12రోజులుగా కార్యాచరణ కొనసాగించారు. వార్ రూం ద్వారా ఏనుగుల కదలికలపై నిఘా పెట్టారు. ఈ ప్రయోగం సత్ఫలితం ఇచ్చింది. 6 డ్రోన్‌ల ద్వారా 24 గంటలపాటు అటవీ సరిహద్దు, పంట పొలాలు, గ్రామీణ ప్రాంత శివారులలో కెమెరాల ద్వారా గుర్తించారు. సాధారణంగా ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు చేతికొచ్చినవేళ ఏనుగులు దాడి చేస్తాయి. పంట పొలాల రుచి మరిగితే ఏనుగులు ఇక నిత్యం వస్తుంటాయి. ప్రారంభంలోనే వాటిని రాకుండా కట్టడిచేస్తే నియంత్రణ సాధ్యమని అటవీశాఖ అధికారులు అంటున్నారు. డ్రోన్‌లలో అత్యాధునిక రెసొల్యూషన్ కల్గిన కెమెరాలను ఉపయోగించి నిరంతం నిఘా పెడతారు. వార్ రూం ద్వారా ఏనుగుల సంచారాన్ని గుర్తించారు. ఒకవేళ అటవీప్రాంత శివారులోని పల్లెలు, పొలాలవైపు ఏనుగులు వస్తున్నట్లు గుర్తిస్తే వార్ రూం ద్వారా అటవీశాఖ అధికారులతోపాటు ఈ ప్రాంత రైతులను అప్రమత్తం చేస్తారు. ఈ ప్రయోగం ద్వారా మనుషుల ప్రాణాలను రక్షించడం, పంటలపై దాడులు జరగకుండా అరికట్టడం, వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా చేసేందుకు వీటలుంటుందని ఎంపీ అంటున్నారు. ఇది విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని అటవీశాఖ భావిస్తోంది.



పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు (ఫైల్)



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.56	1,592.37
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,332	731
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,254	1,959
నీటి నిల్వ (టీఎంసీలు)	92.42	13.13

హెచ్‌ఎంను ఉరితీయాలి



విజయనగర జిల్లాకలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కలబుర్గి జిల్లాలో బంజారా సామాజికవర్గానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హాజీమలాంగ్‌ను ఉరితీయాలని బంజారా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరుతూ విజయనగరం జిల్లా కలెక్టర్ దివాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఇంత నీచానికి పాల్పడిన వ్యక్తిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమానాయక్, ధర్మగురువు తిప్పేశ్వరస్వామి, గోవింద్‌నాయక్, మహిళా యూనిట్ అధ్యక్షులు శిల్ప, నాయకులు పాండునాయక్, సంతోష్ నాయక్, నేత్రాబాయి పాల్గొన్నారు.


వలలు, సేఫ్టీ జాకెట్ల పంపిణీ



మత్స్యకారులకు వలలు, సేఫ్టీ జాకెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే

సిరుగుప్ప, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు వలలు, సేఫ్టీ జాకెట్లను ఎమ్మెల్యే బీ ఎం నాగరాజు పంపిణీ చేశారు. గురువారం సిరుగుప్ప పట్టణం శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో మత్స్యకారులకు పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యకారుల శాఖ జిల్లా డైరెక్టర్ శివన్న, డిప్యూటీ డైరెక్టర్ భవాని, శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు జోడు రథాలు సిద్ధం



బయటకు తీసిన జోడు రథాలు

కంప్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధిచెందిన పేట బసవేశ్వర, నీలమ్మ జోడు రథోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ముస్తాబు కోసం రథాలను ముస్తాబు చేశారు. 8, 9, 10 తేదీలలో జోడు రథోత్సవం జరుగుతున్నట్లు వారు తెలిపారు. 8న అడ్డపల్లకి, 9న నీలమ్మ, పేట బసవేశ్వరస్వామి కల్యాణోత్సవం, 10న జోడు రథోత్సవం చేపడుతున్నట్లు పదాధికారులు తెలిపారు. ఇప్పటికే ఆలయంలో ముస్తాబు పనులు కూడా జోరుగా కొనసాగుతున్నాయి.

ఆహార కిట్ల పంపిణీ

కంప్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని మెట్రి గ్రామ ఆరోగ్య కేంద్రంలో టీబీ రోగులకు జేఎస్‌డబ్ల్యూ అందించిన ఆహార కిట్లను గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు గుండమ్మ అందించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి క్షయ రోగి ప్రభుత్వం అందించే మందులు తీసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు గిరి, కుమారస్వామి, మల్లమ్మ, చిదానందప్ప, విజయలక్ష్మీ, కరిబసమ్మ, జగదీష్, యర్రిస్వామి, ఈరణ్ణ, ప్రధానోపాధ్యాయుడు మూర్తి పాల్గొన్నారు.

ఫెంగల్ తుఫాను ఎఫెక్ట్

- నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతం
- పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం
- దెబ్బతింటున్న పంటలు... ఆందోళనలో రైతులు



వర్షంలో వాహనదారుల ఇబ్బందులు

బళ్లారి సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఫెంగాల్ తుఫాను ప్రభావంతో జిల్లాలో, చాలా ప్రాంతాల్లో చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తునానయి. గురువారం తుంపర్లలో బడిపిల్లలు ఉదయం గొడుగులు, రెయిన్‌కోట్‌లతో పాఠశాలలకు వెళుతున్నారు. మరికొన్ని చోట్ల కుండపోత వర్షంలో కూడా పాఠశాలలకు వెళ్లడం కనిపించింది. 10 గంటల తరువాత వర్షం తగ్గుముఖం పట్టింది. జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రైతులకు సస్యరక్షణకు సంబంధించి వ్యవసాయ,ఉద్యాన శాఖలు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నాయని విజయనగరం జిల్లా అదనపు కలెక్టర్ బాలకృష్ణప్ప తెలిపారు.

పంటనష్ట పరిహారం ఇవ్వాలి: జిల్లాలో తోరణగల్లు, కురేకుప్ప సిద్దమన హళ్ళి తదితర చోట్ల కురిసిన వర్షాలకు వరిపంట నేలకొరిగిపోవడంతో రైతులు ఆందోళ చెందుతున్నారు. తోరణగల్లు పట్టణంలో ఆగలూరప్ప, తిమ్మప్ప, గిరిజప్ప తదితర రైతుల భూముల్లో వరి పూర్తిగా నాశనమైంది. వర్షాలకు సుమారు 300 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ అధికారులు వెంటనే భూములను సందర్శించి పంటనష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కర్ణాటక మండల రైతు సంఘం అధ్యక్షుడు పంపన గౌడ డిమాండ్ చేశారు.



వర్షానికి నేలకొరిగిన వరి పంట

వరిధాన్యం నీటిపాలు

కంప్లి, డిసెంబరు 5(ఆంధ్ర జ్యోతి): గంగావతి తాలుకాలోని సిద్దాపురం వద్ద వేసుకున్న వరిధాన్యం రాశులు గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి నీటిపాలయ్యాయి. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టినా అన్నీ నీళ్ల పాలయ్యాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటలు పూర్తిగా తమకు నష్టాలే మిగిల్చాయన్నారు. తుఫాను ప్రభావం వల్ల పంటలు పూర్తిగా నేలకొరిగాయి. అవి కాకుండా ఇలా కోసిన పంటలు కూడా అమ్మకాల కోసం మార్కెట్లలో వుంచుకుంటే నష్టం వాటిల్లిందని అన్నారు. నష్టపోయిన రైతులను, అధికారులను గుర్తించి వెంటనే నష్టపరిహారం కల్పించి ఆదుకోవాలని తెలిపారు.



తడిసిన వరిధాన్యాన్ని కుప్పగా వేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోండి



ఏపీఎంసీ ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం

కంప్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు వరిధాన్యం, జొన్నలు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంసీ అధ్యక్షుడు చెన్నప్ప కోరారు. ఏపీఎంసీ ఆవరణంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. వరికి క్వింటాల్ రూ.2300 నుంచి 2220 వరకు ధర వుండగా, జొన్నలకు రూ.3375 నుంచి 3425 వరకు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, ఎస్‌ఐడీ నమూనాను సమర్పించాలన్నారు. ఇప్పటికే రైతులు వర్షాల వల్ల నష్టపోయారని, ఉన్నవాటికైనా కనీస గిట్టుబాటు ధరలు కల్పించి, ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వోద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ



కృష్ణకు అభినందనలు తెలుపుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

రాయచూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : కర్ణాటక ప్రభుత్వోద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్ష స్థానం, కోశాధికారి, రాష్ట్ర పరిషత్ సభ్యుడి స్థానాల కోసం పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొత్తం 72 మంది ఓటర్లుండగా 71 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. కృష్ణకు 43 ఓట్లు రాగా.. మహంతేశ్‌కు 22, ఆంజనేయకు 6 ఓట్లు మాత్రం వచ్చాయి. కోశాధికారి స్థానం కోసం జరిగిన ఎన్నికల్లో ప్రసన్న కుమార్, ఖలీల్, రాజశేఖర్‌లు పోటీలో ఉండగా ప్రసన్న కుమార్‌కు 45 ఓట్లు రావడంతో ఆయన విజేతగా నిలిచారు. ప్రత్యర్థులుగా ఉన్న ఖలీల్‌కు 18, రాజశేఖర్‌కు 8 ఓట్లు వచ్చాయి. వీరితో పాటు రాష్ట్ర పరిషత్ స్థానం కోసం జరిగిన ఎన్నికలో జిల్లా నుంచి హసన్ విజేతగా నిలిచినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. వీరి గెలుపుపై ప్రభుత్వ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం జిమ్మిక్కులు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర

రాయచూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్యారెంటీల పేరుతో రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచనకు గురి చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఆరోపించారు. గురువారం జిల్లాలోని లింగసుగూరు వద్ద నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్యారెంటీ పథకాల అమలుకు ఆర్థిక నిధులు అందుబాటులో లేకపోగా అభివృద్ధి కార్యక్రమాలకు కేవలం భూమిపూజలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందన్నారు. మూడు చోట్ల జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ ఆ విజయాన్ని శాశ్వతమని భ్రమిస్తోందన్నారు.



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న విజయేంద్ర

సమాజానికి మంచి చేస్తేనే మనిషి జన్మకు సార్థకత



నారా సూర్యనారాయణ రెడ్డికి గజమాల వేస్తున్న సోదరులు

బళ్లారి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజానికి మంచి చేస్తేనే మానవ జన్మకు సార్థకమని కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు అనూఫ్ కుమార్, బుడా మాజీ అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి అన్నారు. విద్యార్థులకు, పేదలకు, దేవాలయాలకు నారా సూర్యనారాయణరెడ్డి ఎంతో సేవ చేశారని వారు కొనియాడారు. సూర్యనారాయణరెడ్డి జన్మదినాన్ని నగరంలో సోదరులు, అభిమానులు, వాపారవేత్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. జన్మదిన వేడుకల్లో సత్యబాబు, భాస్కర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బళ్లారి సిటీ: మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణరెడ్డి జయంతి సందర్భంగా గురువారం నగరంలోని ఏపీఎంసీ అధ్యక్షుడు కట్టిమనె నాగేంద్ర ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఉదయం ఏపీఎంసీ ఆవరణలో వందలాది మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి రోగుల బంధువులకు భోజనం పెట్టారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాంప్రసాద్, ఏపీఎంసీ ఉపాధ్యక్షుడు రామన్న, అబ్దుల్ సాబ్, వెంకటనాయుడు, అక్కి శివకుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.



అన్నదానంలో ఏపీఎంసీ అధ్యక్షులు కట్టిమని నాగేంద్ర,రాంప్రసాద్

ఉప ఎన్నికల్లో ఓటమిపై బీజేపీ పోస్టుమార్టం

- రెండు రోజుల్లో కేంద్ర కమిటీ సమావేశం

బళ్లారి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సండూరు శాసనసభ ఉప ఎన్నికలో ఎందుకు ఓడిపోయాం? అభ్యర్థి ఎంపికలో లోపమా..? బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందా? రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది కావున ప్రజలు ఈసారి వాళ్లకు అవకాశం ఇచ్చారా? మన పార్టీలో ఉండే నాయకులు సరిగ్గా పనిచేయలేదా? అనే ప్రశ్నలతో బీజేపీ అధిష్ఠానం ఓటమిపై పోస్టుమార్టం చేసేందుకు సిద్ధమైంది. 7 లేదా 9వ తేదీల్లో బీజేపీ కేంద్ర అధికార కమిటీ రాష్ట్ర కమిటీతో సమావేశం అయ్యేందుకు సంకేతం ఇచ్చింది. ఇందులో ప్రధానంగా బీజేపీ రాష్ట్ర నాయకులతో పాటు అసంతృప్తివాదులు, తిరుగుబాటు దారులు అందరూ హాజరు కావాలని కమిటీ సూచించిందని విశ్వసనీయ సమాచారం. నవంబరు 13 జరిగిన శాసనసభ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులతో పాటు కూటమి అభ్యర్థి కూడా ఓటమి చెందారు. మహారాష్ట్రలో బీజేపీ విజృంభిస్తే కర్ణాటకలో ఎందుకు పతనమైందనేదానిపై పార్టీ పెద్దలు చర్చించనున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా సండూరు ఉప ఎన్నికపై చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. సండూరు ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతకు మద్దతుగా మాజీ మంత్రి ఆనంద్‌సింగ్, మాజీ ఎంపీ దేవేంద్రప్ప, మాజీ మంత్రి శ్రీరాములు, మరో వ్యక్తి పనిచేయలేదనేది పార్టీ వర్గాలు గుర్తించాయి. వీరు ఎందుకు పనిచేయలేదు, అసలు కారణం ఏమిటి అని కేంద్ర కమిటీ విచారించే అవకాశం ఉంది. సండూరు బీజేపీ అభ్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో కేవలం 9,469 ఓట్లతో ఓటమి చెందారు. అంటే మనకు మరో 5వేల ఓట్లు ప్లస్ అయింటే గెలుపు సాధ్యమయ్యేదని పార్టీ పెద్దలు అన్నట్లు తెలిసింది. ఆనంద్‌సింగ్ లాంటి వ్యక్తి ఎందుకు పనిచేయలేదు అనేది బీజేపీ గట్టిగా పరిశీలిస్తోంది. ఇక మాజీ మంత్రి శ్రీరాములు కూడా అంతంత మాత్రంగానే పనిచేశరని పార్టీ వర్గాలు గుర్తించాయి. బీజేపీ అభ్యర్థి హనుమంత గెలుపునకు ఎందుకు వీరు గట్టిగా పనిచేయలేదు, హనుమంత గెలిస్తే వీరి ప్రాబల్యం తగ్గుతుందనా..? లేదా వీరికి పోటీగా ఎదుగుతాడనా..? ఇలా అనేక రాజకీయ కోణాల్లో విచారించే అవకాశం ఉంది. మొత్తం మీద బీజేపీ కేంద్ర కమిటీ ఓటమిపై పోస్టుమార్టం చేసేందుకు రెండు రోజుల్లో సమావేశం కానుందని పార్టీ వర్గాల ద్వారా సమాచారం.

రైల్వే స్టేషన్ల పేర్ల మార్పుపై చర్చ



మునిరాబాద్ రైల్వేస్టేషన్

బళ్లారి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఉన్న కొప్పళ, బళ్లారి, విజయనగర జిల్లాల్లో ప్రస్తుతం ఉన్న పేర్లను ప్రముఖుల పేర్లతో పాటు ఈప్రాంతంలో ఉండే ప్రఖ్యాత చెందిన దేవాలయాల పేర్లు పెట్టాలని రైల్వే సలహాకమిటీ డిమాండ్ చేసింది. అమృత్ భారత్ యోజన కింద కేంద్రం రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా కొన్ని రైల్వే స్టేషన్లకు పేర్లు మార్చాలని కూడా కేంద్ర హోంమంత్రిత్వశాఖ భావిస్తుంది. ఇందులో భాగంగా కొప్పళ రైల్వే స్టేషన్‌కు గవిసిద్దేశ్వర పేరును, గంగావతి స్టేషన్‌కు హనుమంతుని జన్మస్థలం అయిన అంజనాద్రి (కిష్కింద), మునిరాబాద్ స్టేషన్‌కు శక్తిదేవత అయిన హులిగి స్టేషన్‌గా పేర్లు పెట్టిలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కుకనూరు తాలూకాలోని భానాపూర్ స్టేషన్‌కు మహాత్మాగాంధీ పేరు పెట్టాలని కోరుతున్నారు. ఈ డిమాండ్‌ను రాష్ట్రం నుంచి కేంద్రానికి సిఫార్సు పంపిన తర్వాత రైల్వే బోర్డు దీన్ని చర్చించనుంది. ఇందుకు కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు కూడా మద్దతు ఇవ్వాలని సంతకాలు సేకరిస్తున్నారు.

ఎడ్లబండ్లను ఢీకొన్న టిప్పర్

- టిప్పర్ డ్రైవర్, నాలుగు ఎద్దుల మృతి



ఘటనా స్థలంలో చెల్లాచెదురైన ఎద్దుల బండ్లు..

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ జిల్లా, మొళకాల్మూరు తాలూకా భైరాపుర గ్రామం వద్ద జాతీయ రహదారి-150పై గురువారం ఉదయం ఎడ్లబండ్లను టిప్పర్ ఢీకొన్న ఘటనలో టిప్పర్ డ్రైవర్‌తో పాటు నాలుగు ఎద్దులు మృతి చెందాయి. రహదారిపై వరుసగా వస్తున్న ఎడ్లబండ్లను ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అతడితో పాటు నాలుగు ఎద్దులు మృతి చెందాయి. ఎడ్లబండ్లలో ఉన్న రైతులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. డ్రైవర్ వివరాలు తెలియరాలేదు. భైరాపుర గ్రామానికి చెందిన రైతులు ఉదయం ఎద్దుల బండ్లతో పొలం పనులకు బయలు దేరారు. చెళ్ళకెర వైపు నుంచి బళ్లారి వైపు వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. చలికాలం కావడంతో రోడ్డు అంతా దట్టమైన మంచు కమ్ముకున్న సమయంలో టిప్పర్ డ్రైవర్‌కు ఎదురుగా వస్తున్న ఎద్దదలబండ్లు కనిపించక పోవడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమిక విచారణలో పోలీసులు తెలిపారు. మొళకాల్మూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోసూరు జోన్

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

హోసూరు(కృష్ణగిరి), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను బాధితులకోసం పలుచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ సరయు పరిశీలించారు. కృష్ణగిరి జిల్లా కావేరిపట్టణం పంచాయతీ యూనియన్, మిట్టపల్లి పంచాయతీ ఎంజీఆర్ నగర్, మేల్మఖాన్ వీది, మలయందహళ్లి పంచాయతీ, వెంకై నగర్, వెలంపట్టి పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల ప్రాంతాలను కలెక్టర్ కె.ఎం.సరయు గురువారం స్వయంగా పరిశీలించారు. కావేరిపట్టణం పంచాయతీలో అదనపు నీటిని సులభంగా విడుదల చేసేందుకు కొత్త వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. మిట్టపల్లి పంచాయతీ మేల్మఖాన్‌వీధి ఓవర్ హెడ్ రిజర్వాయర్ ట్యాంక్‌లో తాగునీటిల్లో క్లోరినేషన్ పనులను పరిశీలించారు. అనంతరం మలయాండహళ్లీ పంచాయతీ, వెంకైనగర్ పరిశీలించగా పక్కనే ఉన్న వాగు నుంచి లోతట్టు ప్రాంతాలకు నీరు చేరింది. ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నుంచి సరఫరా అవుతున్న నీరు సరిగ్గా అందుతుందా లేదా అని పరిశీలించారు. తాగునీటిలో క్లోరినేషన్ సరిగ్గా ఉందో లేదో పరిశీలించారు. ఊత్తంగరై, పోచ్చంపల్లి సర్కిళ్ల పరిధిల్లోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో పౌరకార్మికులచే స్వచ్ఛతా పనులు చేపడుతున్నారు. తనిఖీలలో జిల్లా అభివృద్ధి అధికారి సుబ్రహ్మణి, శరవణన్, జిల్లా కమిషనర్ వళర్మతి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సరయు

అశ్వమేధ యాగం వాయిదా

హోసూరు డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హోసూరు కోట మారియమ్మ ఆలయంలో ఈనెల 7న నిర్వహించాల్సిన సంకల్ప యాగం, అశ్వమేధ యాగం వాయిదా వేస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మనోహరన్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం హోసూరు రాంనగర్ కోటల్లోని మారియమ్మ దేవాలయం వెనుక మైదానంలో ఈనెల 7నుంచి 11వరకు యాగం నిర్వహించాలని నిర్ణయించామని వరుస వర్షాలతో యాగా నిర్వహణకు అవసరమైన మూలికలు తిరువణ్ణామలై నుంచి రాలేదన్నారు. త్వరలోనే తేదీని ప్రకటిస్తామన్నారు.

నెయ్యి కర్మాగారంలో తనిఖీలు

హోసూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హోసూరు శివారు బేగేపల్లి ప్రాంతం గోవింద అగ్రహారలోని ప్రైవేట్ నెయ్యి ఫ్యాక్టరీని ఫుడ్ సేఫ్టీ అధికారి ముత్తు మారియప్పన్ నేతృత్వంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. 15 కిలోల కిరోసిన్, సన్‌ఫ్లవర్ ఆయిల్, వనస్పతి, నెయ్యి, వెన్న నిలువ ఉన్నట్లు గుర్తించారు. తనిఖీల వేళ బూజు పట్టిన 125 కిలోల వెన్నను స్వాధీనం చేసుకుని అధికారుల సమక్షంలో బయటపడేసి ధ్వంసం చేశారు. నెయ్యి నమూనాలను సేకరించి విశ్లేషణ కోసం చెన్నైలోని ల్యాబోరేటరీకి పంపారు. అధికారుల తనిఖీలతో స్థానికంగా కలకలం రేగింది. ప్రజలు నెయ్యి కొనుగోలు చేసేముందు దానిని పరీక్షించి తీసుకోవాలని, లేనిపక్షంలో దాని వల్ల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు సూచించారు.



బూజు పట్టిన వెన్నను ధ్వంసం చేస్తున్న అధికారి

భూసార పరిరక్షణపై అవగాహన

హోసూరు(కృష్ణగిరి), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మట్టి దినోత్సవం (వరల్డ్ సాయిల్ డే)ను హోసూరు ప్రాంతం చిత్తన్నపల్లి గ్రామంలో గురువారం నిర్వహించారు. హోసూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.భువనేశ్వరీ మాట్లాడుతూ.. ఏటా డిసెంబరు 5న ప్రపంచ భూసార దినోత్సవాన్ని పురస్కరించుకుని భూసార పరిరక్షణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. భూసార పరీక్షలు చేయించుకున్నాక ఏ పంటకు అనుకూలం, ఎలాంటి పంట పండిస్తే ఎంతమేర దిగుబడి సాధ్యమో తెలుస్తుందన్నారు. వ్యవసాయ అధికారిణి, టి.రేణుక జీవ ఎరువుల ప్రాముఖ్యతను తెలిపారు. అదియమాన్ వ్యవసాయ కళాశాల, అత్తిముగం భరత్‌కుమార్ వానపాములతో వంటి సహజ ఎరువుల తయారీ, ప్రయోజనాలు, పచ్చి ఆకులు, తగినంతగా ఎరువులతో ఉపయోగించడం ద్వారా పంట దిగుబడి పెరుగుతుందని వివరించారు. వ్యవసాయ ఇంజనీర్ హోసూరు కార్తీకేయన్ సబ్సిడీ పథకాలు, హర్వేస్టర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. రైతులకు సాయిల్ కార్డులు అందచేశారు. వ్యవసాయశాఖ సహాయ అధికారి నందిమంగళం గోవిందస్వామి, ఆత్మ ప్రాజెక్టు టెక్నికల్ మేనేజర్ సుగుణ, అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ షణ్ముగం పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టీచర్లకు విశ్రాంతి గది



విశ్రాంతిగదిలో టీచర్లు, వ్యాపారవేత్త

హోసూరు డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హోసూరు ముల్లైనగర్ పరిధిలోని ప్రాంతంలో ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాల పాఠశాలలో 2500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో ఎక్కువ మంది మహిళా ఉపాధ్యాయులు ఉండడంతో వారికి విశ్రాంతి గది, మరుగుదొడ్ల సౌకర్యం లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలునుకున్న హోసూరులోని ప్రీమియర్ సీలింగ్ సంస్థ యజమాని థేని రాజేంద్రన్ స్పందించి ఈ పాఠశాలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సొంత ఖర్చుతో సుమారు రూ.60 లక్షలతో ఉపాధ్యాయులకు విశ్రాంతి గది, మరుగుదొడ్లు సౌకర్యాన్ని కల్పించారు. గురువారం ప్రభుత్వ పాఠశాలలో లాంచనంగా వీటిని ప్రారంభించారు. వ్యాపారవేత్త థేని రాజేంద్రన్, జిల్లా విద్యాధికారిణి రమాదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ గాంధీ, ఉపాధ్యాయురాలు రేణుక పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు మీడియాతో మాట్లాడుతూ సేవా ధ్యేయంతో వ్యాపారవేత్త అందించిన సేవలను ప్రశంసించారు.



వ్యర్థం.. అనర్థం

(అనంతపురం నగరంలోని గౌరీ కాంప్లెక్స్ వెనుకభాగంలో.. మరువ వంకలో పేదోడి జీవన పోరాటం)

ఇంటింటి చెత్తను
మోసుకెళ్లే వ్యర్థాల నదిలో..
నీ వేట..
ఎంతటి అనర్థమో తెలుసా..?
ప్లాస్టిక్ బాటిళ్లు
ఖాళీ మద్యం సీసాలు
కవర్లు.. పాడైన వస్తువులు
కాస్త ఓపికగా
పారిశుధ్య కార్మికులకు
ఇవ్వలేని జనం నడుమ
పొట్టకూటి కోసం పోరాడే
పేద మనిషీ..!
ప్రకృతిపరంగా నువ్వు..
ఓ పర్యావరణవేత్తవు తెలుసా..!





క్రీడా వికాసమేదీ..!

• మరుగునపడ్డ క్రీడాసామగ్రి • నిరుపయోగంగా రన్నింగ్ ట్రాక్ • ఇబ్బందుల్లో క్రీడాకారులు • సౌకర్యాలు కల్పించాలని వినతి

"గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి వారి నైపుణ్యాన్ని దేశ, రాష్ట్ర స్థాయికి వెళ్లేందుకు తీర్చిదిద్దాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన క్రీడా వికాస కేంద్రాలు నేడు దయనీయంగా మారాయి. 5.11 ఎకరాల్లో ఇండోర్ స్టేడియం, పెవలియన్ భవనం, 200 మీటర్ల పరుగు పందెం కోర్ట్ తదితర వాటిని నిర్మించారు. అయితే వాటి నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అయినా స్పందించి.. నిధులు విడుదల చేసి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు." - పెనుకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి)

నిరుపయోగంగా ఉన్న క్రీడా వికాస కేంద్రం





పిచ్చిమొక్కలతో నిండిన 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్



తుప్పుపట్టిన జిమ్ సామగ్రి



వైసీపీ హయాంలో క్రీడావికాస కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు (ఫైల్)

ఆర్భాటంగా ప్రారంభం

2014 టీడీపీ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నియోజకవర్గానికి ఓ క్రీడా వికాస కేంద్రాన్ని అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేయడానికి పూనుకున్నారు. ఈ క్రమంలో పెనుకొండలో ఆ కేంద్ర నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో 2019 నవంబరు12న నాటి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన క్రీడల సంక్షేమశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి శంకర్‌నారాయణ పూర్తయిన ఆ స్టేడియానికి వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంగా పేరు మార్చి ఆర్భాటంగా ప్రారంభించారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఆ కేంద్రాల నిర్వహణ గురించి ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ క్రీడావికాసానికి ఒక్క రూపాయి కూడా నిధులు ఖర్చుపెట్టకపోవడం శోచనీయం.

రూ.2.10 కోట్లతో నిర్మాణం

పెనుకొండ పట్టణంలోని పరిటాల డిగ్రీ కళాశాలలో 5.11 ఎకరాల్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ నిధులు రూ.2.10కోట్లు ఖర్చు చేసి ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. అందులో షెటిల్ కోట్, జిమ్, టేబుల్ టెన్నీస్, అందులో క్రీడాకారులకు డార్మెంటరి గదులు నిర్మించారు. అలాగే పెవిలియన్ భవనం 200మీటర్ల పరుగు పందెం కోర్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక షెటిల్‌కోట్ తప్ప మిగిలిన వన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. జిమ్ పరికరాలు తుప్పుపట్టి మూలానపడ్డాయి.



మరుగున పడ్డ టెన్నిస్ కోర్టు మెష్

సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

సత్యసాయిజిల్లాలో మడకశిర రెండు, పెనుకొండ, రామగిరి, ధర్మవరంలో ఒక్కో క్రీడా వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఖేల్ ఇండియాలో భాగంగా సెంట్రల్ స్కీంను సద్వినియోగం చేసుకుంటున్నాం. గత ఐదేళ్లలో ఆడదాం ఆంధ్ర మాత్రమే జరిగింది. వికాశ కేంద్రాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. సమస్యను ఉన్నతాధికారులకు వివరించాం.

- ఉదయ్‌భాస్కర్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి

సౌకర్యాలు లేవు



పెనుకొండలో పలు క్రీడల్లో రాణించే సత్తా ఉన్నా యువతీ యువకులు ఉన్నారు. ఒక్క షెటిల్‌కోర్ట్ మినహా ఏ సౌకర్యాలు లేవు. షెటిల్‌కోర్ట్ కూడా సొంత ఖర్చుతో క్రీడాకారులు బాగుచేసుకున్నారు. పెనుకొండ ఎమ్మెల్యే, మంత్రి సవిత క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా చర్యలు చూపి ఈ క్రీడావికాస కేంద్రానికి పూర్వవైభవం తీసుకురావాలి. క్రీడాకారులు సత్తాచాటి రాష్ట్ర, దేశ క్రీడల్లో రాణిస్తారు.

- కమలాకర్, టెన్నిస్ క్రీడాకారుడు, పెనుకొండ

నిరుపయోగంగా పరికరాలు



ఒక్క బ్యాడ్మిటన్ కోర్టు మాత్రం ఉంది. మిగిలిన జిమ్, టేబుల్ టెన్నీస్, రన్నింగ్ కోర్ట్ ముళ్ల పొద లమయం అయ్యాయి. టెన్నీస్‌కోర్ట్ పూర్తీ నిరుపయోగంగా మారింది. ప్రజాప్రతినిధులు దృష్టిసారించి సౌకర్యాలు కల్పిస్తే పెనుకొండ క్రీడాకారులు సత్తాచాటుతారు. చుట్టూ కాంపౌండ్ లేక అసౌకర్యంగా మారింది.

- రిజ్వాన్, బ్యాడ్మింటన్ కోచ్

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా



5.11ఎకారాల్లో నిర్మించిన ఈ క్రీడా వికాస్ కేంద్రం చుట్టూ ప్రహరీ లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రివేళల్లో మందు బాబులు వస్తుంటారు. చుట్టూ కాంపౌండ్ నిర్మించి క్రీడావికాస కేంద్రంలో 200మీటర్ల రన్నింగ్ కోర్టు, జిమ్‌సామగ్రి, టేబుల్ టెన్నీస్ కోర్టు నిర్మించాలి. -భాజా, క్రీడాకారుడు

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక

సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుమాధవ్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. పాలిటెక్ ఫెస్ట్-2024 రీజనల్ స్థాయిలో అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 17 కళాశాలల విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో ఎంపికైన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ఫెస్ట్‌లో ప్రదర్శిస్తారని సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుమాధవ్ పేర్కొన్నారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఫెస్ట్ గురువారం ముగిసింది. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను జేఎన్‌టీయూ ఈఈఈ బ్రాంచ్ అసోసియేట్ ప్రొఫెసర్ రామశేఖర్‌రెడ్డితోపాటు కియ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. గుంతకల్లు కళాశాల విద్యార్థుల పవర్ సిగ్నలింగ్ సిస్టం, రాయదుర్గం కళాశాల విద్యార్థుల ఆర్గానిక్ లోడ్ క్యారింగ్ ఎయిడ్ ఫర్ లేబర్ వర్క్ అనే అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులు ప్రథమ, ద్వితీయ బహుమతులకు ఎంపికైనట్లు న్యాయనిర్ణేతలు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లును అందజేశారు.

అర్ధంతరంగా ఆగిన గోడౌన్ నిర్మాణం



శ్రీధరఘట్టలో ఆగిన సొసైటీ గోడౌన్ పనులు

బొమ్మనహాళ్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పండిన పంటలను నిల్వ ఉంచుకునేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సొసైటీ గోడౌన్ నిర్మాణాన్ని అర్ధంతరంగా ఆపేశారు. మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ సహకార సంఘం సొసైటీలకు గోడౌన్లు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో కొంతవరకు పనులు చేశారు. పూర్తయిన వాటిని సొసైటీలకు అప్పగించలేదు. శ్రీధరఘట్ట గ్రామంలో రూ. 82 లక్షలతో నిర్మిస్తున్న గోడౌన్‌ను అర్ధంతరంగా ఆపేశారు. దీంతో రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునే సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగానహళ్లిలో నిర్మించిన గోడౌన్ పూర్తయినా కాంట్రాక్టర్ సొసైటీలకు అప్పగించలేదు. అర్ధంతరంగా ఆగిన గోడౌన్ పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

మహిళల అభివృద్ధికి వంద రోజుల ప్రణాళిక

జీవనోపాధుల పెంపునకు ప్రాధాన్యం

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

ఇంటర్వ్యూ Interview



అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళికతో పనిచేస్తున్నామని డీఆర్‌డీఏ-వెలుగు అనంతపురం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఈశ్వరయ్య తెలిపారు. వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్న క్రమంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న: సంస్థాగత నిర్మాణం ఎలా చేస్తున్నారు...?

పీడీ: సంస్థాగత నిర్మాణం చాలా పటిష్టంగా ఉంటుంది. స్వయం సహాయక సంఘాలు, గ్రామైక్య సంఘం, మండల సమాఖ్య, జిల్లా సమాఖ్య ఉంటాయి. ఇందులో ఇతరుల జోక్యం ఉండదు. మొత్తం సంఘంలో ఉండే సభ్యులే సంస్థాగత నిర్మాణం చేపడతారు.ఐ

ప్రశ్న: జిల్లాలో ఎన్ని డ్వాక్రా సంఘాలున్నాయి..?

పీడీ: అనంతపురం జిల్లాలో 35,897 స్వయం సహాయక మహిళా సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయి. ఇందులో 3,79,433 మంది సభ్యులు ఉన్నారు.

ప్రశ్న: ఏయే సామాజికవర్గాల్లో ఎంతమంది ఉన్నారు..?

పీడీ: జిల్లాలో ఎస్సీ కేటగిరిలో 5,799 సంఘాల్లో 75,037 మంది ఉండగా, ఎస్టీలు 1050 సంఘాల్లో 15,846 మంది, బీసీలలో 24,237 సంఘాలకు గాను 2,14,279 మంది, ఓసీలో 4016 సంఘాల్లో 61,644 మంది, మైనార్టీలలో 795 సంఘాల్లో 12,627 మంది సభ్యులు ఉన్నారు.

ప్రశ్న: మహిళల అభివృద్ధికి ఎలా పనిచేస్తున్నారు..?

పీడీ: వంద రోజుల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. ప్రతి వంద రోజుల పురోగతిని సమీక్షించుకుని, వెనుకబడిన సబ్జెక్ట్‌లపై లోతుగా పరిశీలించి మరింత అభివృద్ధి సాధించేలా కృషి చేస్తున్నాం.

ప్రశ్న: మహిళల కోసం ఏ పథకాలు అమలు చేస్తున్నారు?

పీడీ: గతంలోకంటే ఈ ఏడాదిలో మరిన్ని పథకాలు తీసుకువచ్చాం. ఇందులో పింఛన్‌తో పాటు బ్యాంకు లింకేజీ (రుణాలు), ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్, సీడ్ క్యాపిటల్, హయ్యర్ ఆర్డర్ ఎంటర్‌ప్రైజెస్, ఉన్నతి, స్త్రీనిధి, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన, చేయూత మహిళా మార్టులు, స్వీప్ అంబ్రెల్లా ప్రాజెక్ట్, ఎస్టీ మహిళలకు ప్రత్యేకంగా పెరటికోళ్ల పెంపకం పథకాలు అమలు చేస్తున్నాం.

ప్రశ్న: పురోగతిని ఎలా అంచనా వేస్తారు...?

పీడీ: జిల్లాలో ఉన్న స్వయం సహాయక సంఘాలకు గ్రేడింగ్ ద్వారా పురోగతిని గుర్తిస్తాం. ఏ గ్రేడ్‌లో 31,815 సంఘాలు, బీ గ్రేడ్‌లో 4082 సంఘాలు ఉన్నాయి. బీ గ్రేడ్‌లో ఉన్న సంఘాలను ఏ గ్రేడ్‌లోకి తీసుకురావడమే పురోగతి సాధించడం.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎంత మందికి, ఎంత రుణాలు ఇచ్చారు?

పీడీ: బ్యాంకు లింకేజీ కింద ఈ ఏడాదిలో 25,798 మంది సభ్యులకు రూ.1239 కోట్లు లక్ష్యంగా కాగా 8,345 మందికి రూ.670 కోట్లు చెల్లించాం. ఉన్నతి కింద 2,415 మందికి రూ.12.45 కోట్లు లక్ష్యంగా ఉండగా...2,307 మందికి రూ.11.75 కోట్లు చెల్లించాం. స్త్రీనిధి కింద 32,400 మంది సభ్యులకు రూ.162 కోట్లు లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 12,200 మందికి రూ.96.70 కోట్లు చెల్లించాం. నార్పలలో మహిళామార్టు ద్వారా అభివృద్ధి వైపు నడుస్తున్నారు.

భూసమస్యల పరిష్కారానికి అడుగులు

ప్రజల వద్దకే అధికారులు
ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల నమోదు
నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

అనంతపురం టౌన్/ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనేక సంవత్సరాలుగా గ్రామాల్లో భూములకు సంబంధించిన సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూసమస్యలు మరింత అధికమయ్యాయి. జగనన్న భూ హక్కు... భూ రక్ష పేరిట చేపట్టిన రీ సర్వే లోపభూయిష్టంగా జరిగింది. ఈ సర్వే రైతులకు కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. పాసు పుస్తకాల్లో అచ్చుతప్పులు, భూ విస్తీర్ణంలో తేడాలు, ఒకరి సర్వే నెంబరు మరొకరికి కేటాయింపు, జాయింట్ ఎల్‌పీఎం తదితర సమస్యలు వెలుగుచూశాయి. వీటిని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులకు సిద్ధమైంది. తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ, సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ, రిజిస్ట్రేషన్, అటవీశాఖ ఇతర శాఖల సిబ్బంది హాజరు కానున్నారు. జిల్లా నోడల్ అధికారి, నియోజకవర్గ నోడల్ అధికారులు, మండలాలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ఆర్ఓఆర్, 1బీ, అడంగళ్‌తో పాటు ప్రభుత్వ భూమి రిజిస్టర్ కాపీలు, వెబ్‌ల్యాండ్ నుంచి ముద్రించిన పత్రాలను ఈ సదస్సుల్లో ప్రదర్శిస్తారు. భూ సమస్యలపై రైతులు అందించే అర్జీలను అధికారులు పరిశీలించి వెంటనే వాటికి సంబంధించిన రసీదులను అందిస్తారు. ఆన్‌లైన్‌లో అన్ని ఫిర్యాదులు నమోదు చేస్తారు. క్షేత్రస్థాయిలలో భూములను పరిశీలించి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తారు. శుక్రవారం నుంచి జనవరి 8వతేదీ వరకు ఈ సదస్సులు కొనసాగుతాయి. ఈ మేరకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉన్నతాధికారులు ఆ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి సన్నద్ధం చేశారు. ఆయా గ్రామాలకు సంబంధించిన మొత్తం రెవెన్యూ రికార్డులను అందుబాటులో ఉంచుకొని ప్రజలు ఇచ్చే ఫిర్యాదు మేరకు పరిశీలించి వాస్తవాలు చెప్పి పరిష్కారం చూపాల్సి ఉంటుంది. ఒకవేళ సమస్యగా ఉంటే 45 రోజుల్లో వాటిని పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది.

భూ సమస్యలను పరిష్కరించాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చిన ప్రతి రైతుకు రసీదు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా గతంలో అమలు కాలేదన్నారు. గతంలో వచ్చిన అర్జీలను తక్షణం పరిష్కరించాలన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో రికార్డులు ఆన్‌లైన్‌లో ఉంచాల పేర్కొన్నారు. రికార్డులు ఆన్‌లైన్‌లో పెట్టకపోయినా కబ్జాలు పెరిగిపోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు.



భూ రీసర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ సదస్సులపై అవగాహన కల్పించాం. సదస్సులు నిర్వహించే గ్రామాల్లో ముందుగానే దండోరా వేయిస్తాం. ప్రజలు సమస్యలను తెలిపితే అక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఏదైనా ఇబ్బంది ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి 45 రోజుల్లో దానికి సమాధానం చూపుతాం. -శివనారాయణశర్మ, జేసీ, అనంతపురం జిల్లా



అధికారులు. ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్న అనంతపురం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తదితరులు

అన్ని గ్రామాల్లో సదస్సులు

జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తాం. ఎస్సీ, ఎస్టీ నివాసాలతో సహా రెవెన్యూ గ్రామాల్లో తిరిగి గ్రామసభలు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. భూ యజమానుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు. వాటికి వెంటనే రసీదు ఇస్తారు. క్షేత్ర సందర్శనతో సహా ప్రతి ఫిర్యాదును సమగ్రంగా విచారించి పరిష్కరించాలి. ముఖ్యంగా హైకోర్టు కేసులను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని రెవెన్యూ అధికారులకు సూచనలు ఇచ్చాం.

- టీఎస్ చేతన్, కలెక్టర్, శ్రీసత్యసాయి జిల్లా



గుంతను తవ్వి వదిలేశారు..!



బొమ్మనహాళ్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం క్యాంప్ వద్ద బళ్లారి-కళ్యాణదుర్గం రోడ్డు పక్కన గుంతను తీశారు. పని జరిగిన తర్వాత గుంతను పూడ్చకుండా అలాగే వదిలేశారు. శ్రీరాంరెడ్డి తాగునీటి పైపులైను పగిలిపోవడంతో మరమ్మతులు చేసేందుకు ఎక్స్‌కవేటర్ ద్వారా గుంత తీశారు. పనులు పూర్తి చేశారు గానీ గుంతను వదిలేశారు. రోడ్డు పక్కనే ఇలా గుంతను వదిలేసి ప్రమాదాలకు దారితీస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే హడావుడి చేసే అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం లేదని విమర్శిస్తున్నారు.

ఊళ్లు కడతామని బీళ్లుగా మార్చారు..!



బొమ్మనహాళ్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదల లే అవుట్లపై ప్రదర్శించిన నిర్లక్ష్యానికి సాక్ష్యంగా మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో వేసిన లే అవుట్లు నిలుస్తున్నాయి. ఊళ్లు కడుతున్నామని ఊదరగొట్టిన నాటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చివరకు ఆ లే అవుట్లను బీళ్లుగానే వదిలేశారు. పొలాల మధ్యలో లే అవుట్లు వేయడంతో నేటికీ అక్కడకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఉద్దేహాళ్ గ్రామంలో తిమ్మలాపురం రోడ్డుకు లేఅవుట్లు వేశారు. 90 మందికి పైగా పట్టాలు ఇచ్చారు. ఒక్క ఇల్లు కూడా కట్టించలేదు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

జడ్పీలో కారుణ్య నియామకాలు



నియామక ఉత్తర్వులు ఇస్తున్న చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం విద్య, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, జిల్లా పరిషత్, మండల పరిషత్‌కు సంబంధించి వివిధ కార్యాలయాల్లో పని చేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబికులు కారుణ్య నియామకం కింద 12 మందికి ఉత్తర్వులిచ్చారు. గురువారం జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ చాంబర్‌లో సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో అర్హులైన అభ్యర్థులు 12 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. అభ్యర్థులు నందిని, బాలాజీ, ముజఫర్ సుల్తానా, హేమంత్, ఉమా, ఉమేష్‌కుమార్, తిప్పేస్వామి, ప్రసాద్, నిరోషా వ్యాస్, సుజాతమ్మ, షెక్షా, శోభారాణికి ఆఫీస్ సబార్డినేటర్లుగా ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ నియామక ఉత్తర్వులు పొందిన ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ ప్రారంభం

జిల్లా పరిషత్ ఆవరణలో డీపీఆర్సీ సమావేశ మందిరంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అంశంపై రెండు రోజుల శిక్షణ ప్రారంభమైంది. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య శిక్షణను ప్రారంభించారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజాసేవలో ఉండే ఉద్యోగులు నిత్యం తమ విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంచుకోవాలని సూచించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

బీఆర్ అంబేడ్కర్ (వర్ధంతి)



భారత రాజ్యాంగ నిర్మాత, 'భారత రత్న' గ్రహీత భీమ్‌రావ్ రామ్‌జీ అంబేడ్కర్ 1891 ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ జిల్లా మాహూ ప్రాంతంలో జన్మించారు. 'బాబాసాహెబ్'గా పేర్కొం దారు. న్యాయ, ఆర్థికశాస్త్ర నిపుణులే కాక రాజకీయ నేత, సంఘసంస్కర్త, ఆయన రూపొందించిన రాజ్యాంగం ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రపంచంలోనే ఎంతో గొప్ప దిగా గుర్తింపు పొందింది. సమాజంలో నిమ్నవర్గాల ఉన్నతికి కృషి చేశారు. కేంద్ర న్యాయ శాఖ తొలి మంత్రిగా వ్యవహరించారు. 1956 డిసెంబరు 6న కన్నుమూశారు.

చంద్రలేఖ (జయంతి)




చంద్రలేఖ ప్రభుదాస్ పటేల్ 1928 డిసెంబరు 6న మహారాష్ట్ర రాష్ట్రం వాడా ప్రాంతంలో జన్మించారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు మేనకోడలు. నృత్యకారిణి, కొరియోగ్రాఫర్. ప్రత్యేకించి భరత నాట్యంలో కళాకారిణిగా పేరొందారు. యోగా, కలరియపట్టులోను రాణించారు. రచయితగా ఎన్నో పుస్తకాలు రాశారు. సృజనాత్మక నృత్యానికి సంగీత నాటక అకాడమీ పురస్కారం, కాళిదాస్ సమ్మాన్ తదితర అవార్డులు లభించాయి. 2006 డిసెంబరు 30న కన్నుమూశారు.

సావిత్రి (జయంతి)



తెలుగు సినీరంగంలో 'మహానటి'గా పేరొందిన అలనాటి మేటి నటీమణి నిశ్శంకర సావిత్రి 1936 డిసెంబరు 6న గుంటూరు జిల్లా చిర్రావూరులో జన్మించారు. తెలుగు, తమిళ సినీరంగాలలో నటి, దర్శకురాలు. దానధర్మాల విషయంలో ఆమెది ఎముక లేని చేయి. చిన్నతనంలోనే శాస్త్రీయనృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఎన్టీఆర్, జగ్గయ్య తదితరులు నడిపిన నాటకాల కంపెనీలో పనిచేసి అనంతరం పెదనాన్న నడిపిన నాట్యమండలిలో కూడా నటించారు. తెలుగు సినీచరిత్రలో అజరామరం అనదగిన 'మాయా బజార్'లో ఆమె నటనా వైదుష్యం ఆమె కీర్తి పతాకంలో మణిమకుటంగా నిలిచిందనడంలో అతిశయోక్తి లేదు. తమిళంలో 'నడిగర్ తిలగం' అనే బిరుదు పొందారు. తమిళ నటుడు జెమినీ గణేశన్‌ను పెళ్లాడారు. 46వ యేట 1981 డిసెంబరు 26న కన్నుమూశారు.

కద్రి గోపాల్‌నాథ్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత కద్రి గోపాల్‌నాథ్ 1949 డిసెంబరు 6న దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ తాలూకా సజిప మూడ గ్రామంలో జన్మించారు. నాదస్వర విద్వాన్‌గా పేరొందారు. శాక్సోఫోన్‌పై కర్ణాటక సంగీతాన్ని, పాశ్చాత్యసంగీతాన్ని ప్రదర్శించి శాక్సోఫోన్ చక్రవర్తిగా పేరొందారు. ఆకాశవాణి మంగళూరు కేంద్రం ద్వారా తన తొలి కచేరీని చేశారు. కంచికామకోటి పీఠం, శృంగేరి శారదా పీఠం, అహోబిల మఠం, పిళ్ళయార్ పత్తి దేవాలయాలకు ఆస్థాన విద్వాంసుడిగా వ్యవహరించారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కచేరీలు నిర్వహించారు. సంగీతవాద్య రత్న, కర్ణాటక కళాశ్రీ, నాద కళానిధి, కలైమామణి, కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారం పొందారు. 2019 అక్టోబరు 19న కన్నుమూశారు.

పీటర్ హాండ్కే (పుట్టినరోజు)



నోబుల్ పురస్కార గ్రహీత పీటర్ హాండ్కే 1942 డిసెంబరు 6న ఆస్ట్రియా దేశం గ్రిఫెన్ ప్రాంతంలో జన్మించారు. ఆయన నవలా రచయిత, అనువాదకుడు, కవి, సినీ దర్శకుడు, స్క్రీన్ రైటర్‌గా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన రచనలు ఆంగ్లంలోకి అనువాదం అయ్యాయి. 1973లో జార్జ్ బుక్నర్ ప్రైజ్ అందుకున్నారు. ఇంటర్నేషనల్ ఇబ్సన్ అవార్డు, జార్జ్ బుక్నర్ ప్రైజ్ తదితర పురస్కారాలు పొందారు. 2019లో సాహిత్యంలో నోబెల్ పురస్కారం పొందారు. జీవిత సాఫల్య పురస్కారంతోపాటు పలు అవార్డులు పొందారు. 2024లో గ్రాండ్ డెకొరేషన్ ఆఫ్ హానర్ ఇన్ గోల్డ్ విత్ సాష్ ఫర్ సర్వీసెస్ టు దిపబ్లిక్ ఆఫ్ ఆస్ట్రియా గౌరవం అందుకున్నారు.

శేఖర్ కపూర్ (పుట్టినరోజు)



హిందీ సినీరంగంలో పేరొందిన దర్శకుడు, 'పద్మశ్రీ' గ్రహీత శేఖర్ కపూర్ 1945 డిసెంబరు 6న పంజాబ్ రాష్ట్రం లాహోర్ ప్రాంతంలో జన్మించారు. నటుడు, నిర్మాత. ప్రముఖ నటుడు దేవానంద్‌కు మేనల్లుడు. 'మసూమ్', 'మిస్టర్ ఇండియా' సినిమాలు ఆయనకు ఎంతో పేరుతెచ్చాయి. 'బండిట్ క్వీన్' సినిమాకు జాతీయ ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ పురస్కారం దక్కింది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు జ్యూరీ సభ్యుడిగా వ్యవహరించారు. 2020 నుంచి ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు చైర్మన్‌గా ఉన్నారు. 2023లో 54వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాకు చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు.

తక్కువ ధరకు బంగారం పేరుతో జనానికి టోకరా..

రాయచూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకే అసలైన బంగారాన్ని ఇస్తామంటూ నమ్మించి నకిలీ బంగారాన్ని అంటగడుతున్న బృందంలోని ఓ మహిళను స్థానికులు పోలీసులకు అప్పగించాడు. విజయనగర జిల్లా హొసపేటకు చెందిన నాగరాజు ఇలాంటి మోసానికి గురికాగా అతడే నెల రోజులుగా నిందితులను వెతికి గురువారం సింధనూరు పోలీసులకు అప్పగించాడు. బాధితుడు నాగరాజు ఇచ్చిన వివరాల మేరకు ముగ్గురు సభ్యులున్న టీం ఒకటి, గత కొంత కాలంగా తక్కువ ధరకే బంగారానిస్తామంటూ జనాన్ని మోసగించే పనిలో ఉన్నారు. ఒక్కొకరి నుంచి రూ.3 నుంచి 4 లక్షలకు పైగా డబ్బులు తీసుకుని ఇచ్చిన బంగారం నకిలీదని తేలడంతో వీరంతా మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించారు. ఇదే రకమైన మోసానికి గురైన నాగరాజు మోసగాళ్లను పట్టుకోవాలన్న ఉద్దేశంతో నెల రోజులుగా వారిని గాలిస్తున్నట్లు తెలిపాడు. చివరకు గురువారం సింధనూరులో ఈ ముగ్గురు మహిళలను గుర్తించాడు. వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా ఒక మహిళ పట్టుబడింది. మిగితా ఇద్దరు పరారైనట్లు తెలిపారు. ఆమెను పోలీసులకు అప్పగించగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

విశ్వేశ్వరయ్య కళాశాలను ఐఐటీ తరహాలో మారుస్తాం

- ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

బెంగళూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రారంభించిన యూనివర్సిటీ ఆఫ్ విశ్వేశ్వరయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌ను ఐఐటీ తరహాలో అభివృద్ధి చేసేందుకు కట్టుబడ్డామని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అన్నారు. కళాశాలలో గురువారం యూవీసీఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. మంత్రి సుధాకర్ మాట్లాడుతూ యూవీసీఈకి ఎంతో చరిత్ర ఉందన్నారు. కళాశాలను ఆధునీకరించేందుకు సీఎం, డీసీఎంలు రానున్న బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం రూ.100కోట్లు విడుదల చేశారన్నారు. ఐఐటీ తరహాలో ప్రకటించడం కాదని అందుకు తగిన మౌలిక సదుపాయాలు మా లక్ష్యమన్నారు. జ్ఞానభారతి క్యాంపస్‌లో 50 ఎకరాలు కేటాయించామని అక్కడ ఆధునిక సౌకర్యాలతో నిర్మాణాలు చేపడతామన్నారు. టెండర్లు పిలిచేందుకు పాలనాపరమైన ఆమోదం కేబినెట్‌లో లభించిందన్నారు. పూర్వవిద్యార్థులు 16ఏళ్లుగా ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. ప్రసుత్తం 160 మందికి రూ.45 లక్షలు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు ఫౌండేషన్ చైర్మన్ బీవీ జగదీశ్ ప్రకటించారు. యూవీసీఈ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షుడు ముత్తురామన్, డైరెక్టర్ సుభాషి త్రిపాఠి, స్కాలర్‌షిప్ కమిటీ అధ్యక్షుడు రామ వసంతరామ్, మాధవ, అలీస్ అబ్రహంతోపాటు పలువురు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న మంత్రి సుధాకర్

భూసార పరీక్షలు చేయించుకోండి

బంగారపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రతిరైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించు కోవాలని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గౌడ అభిప్రాయపడ్డారు. కామసముద్ర హోబళి తొప్పనహళ్ళిలోని ఆదర్శరైతు తిమ్మణ్ణకు చెందిన తోటలో గురువారం ప్రపంచ మట్టిదినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశానికి పాలు, పండ్లు, కూరగాయలు, పట్టు, బంగారం అందించిన కోలారు జిల్లా రైతులకు షాక్ తగిలేలాంటి నివేదిక వెలుగుచూసిందన్నారు. ఉద్యానవన శాస్త్రవేత్తలు వెలువరించిన సర్వే నివేదిక ప్రకారం కలుషితమైన మట్టి కారణంగా కూరగాయలలోనూ ప్రమాదకరమైన అవశేషాలు, కారకాలు ఉన్నాయని తేలిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్ష చేయించుకుని పంటకు అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడాలన్నారు. లేనిపక్షంలో మనం చల్లే మందుల ప్రభావం ప్రజలందరి ఆరోగ్యంపై పడుతుందన్నారు. పూర్వీకులు సేంద్రీయవిధానంతో సాగు చేసేవారని, ఆరోగ్యకరమైన కూరగాయలు లభిస్తుండేవన్నారు. అయితే ఎంఎన్‌సీ కంపెనీల చేతిలో కొంతమంది అధికారులు, పాలకులు పనిచేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. దీని ప్రభావం రైతులపై పడుతోందన్నారు. ఇకనైనా అన్నదాతలు తమ పంటల సాగులో మోతాదుకు మించి మందులు వాడరాదన్నారు. మట్టినుంచే అన్నం, మట్టి నుంచే బంగారం, మట్టినుంచే ప్రాణం అని తెలిపే దాసరపదాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, తిమ్మణ్ణ, శివారెడ్డి, వెంకటేశప్ప, అశ్వథప్ప, గిరీశ్, నారాయణ స్వామి, మునికృష్ణ, అప్పోజిరావ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో...

చింతామణి: ఇటీవలికాలంలో మట్టి సైతం కలుషితం అవుతోందని దీని ప్రభావం పంటలపై ఉందని తాలూకాలోని కురుబూరు వ్యవసాయ విజ్ఞానకేంద్రం మట్టి శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యా అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కూతరాజనహళ్ళిలో గురువారం ఏర్పాటైన మట్టి దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. మట్టిగుణాన్ని అర్థం చేసుకుని సరైన పంటలు పండించాలన్నారు. ఆహార భద్రతకోసం ఆరోగ్యకరమైన పంటలు వచ్చేలా మోతాదుకు మించి మందులు, ఎరువులు వాడరాదన్నారు. డాక్టర్ తన్వీర్ అహ్మద్ మాట్లాడుతూ రైతులు శాస్త్రీయతను పెంపొందించుకోవాలని, భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు కొబ్బరి, నేరేడు మొక్కలు పంపిణీ చేశారు. ప్రజలు కూడా ఈ అంశంపై అవగాహన పెంచుకోవాలని తద్వారా మట్టి సంరక్షణకు ప్రతినబూనాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.



చింతామణి తాలూకాలో కొబ్బరిమొక్కలు పంపిణీ



రైతుసంఘం ఉపాధ్యక్షుడు నారాయణగౌడ తదితరులు

స్టార్టప్‌లలో వెనుకబడుతున్న కర్ణాటక

- రామయ్య ఎవాల్యుయేట్‌లో హెచ్చరించిన ప్రశాంత్ ప్రకాశ్



కార్యక్రమంలో కర్ణాటక స్టారప్ విజన్ గ్రూప్ అధ్యక్షుడు ప్రశాంత్ ప్రకాశ్ తదితరులు

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశ స్టార్టప్ రాజధానిగా కొనసాగిన కర్ణాటక ఇటీవల కొంతకాలంగా వెనుకబడుతోందని దేశ రాజధాని ఢిల్లీ ముందంజలో ఉందని యువ పారిశ్రామికవేత్తలు, ఇంజనీరింగ్ పూర్తి చేసినవారు కొత్త ఆలోచనలతో స్టార్టప్‌లను ఆరంభించాలని కర్ణాటక స్టారప్ విజన్ గ్రూప్ అధ్యక్షులు, ఎక్సెల్ ఇండియా ఫండింగ్ పార్ట్‌నర్ ప్రశాంత్ ప్రకాశ్ హెచ్చరించారు. రామయ్య ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రామయ్య ఎవల్యూట్ స్టార్టప్ అవార్డు 2024 కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రశాంత్ ప్రకాశ్ మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు స్టార్టప్‌ల రూపకల్పన విషయాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. 2025 నాటికి దేశంలో 25-30 స్టార్టప్ కంపెనీలకు ఐపీఓను విడుదల చేస్తామన్నారు. ఇందులో ఢిల్లీకి చెందిన ఐదు కంపెనీలు ఉన్నాయన్నారు. మన రాష్ట్రానికి చెందినవారు సమయం వృథా చేస్తున్నారని అనిపిస్తోందన్నారు. ఆన్‌లైన్ మార్కెట్‌లో ఎన్నో కంపెనీలు వస్తున్నాయని అర్థం చేసుకోవాలన్నారు. గ్లోబల్ స్థాయిలో గత ఏడాది 20స్టార్టప్‌లలో 9 ఉత్పాదనా రంగానికి చెందినవి ఉన్నాయన్నారు. డీప్‌టెక్, హెల్త్‌టెక్‌లవైపు విద్యార్థులు ఆసక్తి చూపాలన్నారు. ఎవల్యూట్ కోఫౌండర్ డాక్టర్ సమర్థ నాగభూషణ్‌తోపాటు రామయ్య కేపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు. 400 దరఖాస్తులు రాగా అంతిమంగా 21 కంపెనీలను ఎంపిక చేసినట్టు ప్రకటించారు. పలువురుస్టార్టప్ కంపెనీల ముఖ్యులకు అవార్డులు ప్రదానం చేశారు.

జనవరి 15వరకు అయ్యప్ప భక్తులకు అవకాశం

బంగారపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పునీత్‌రాజ్‌కుమార్ సర్కిల్‌లోని అయ్యప్పస్వామి సన్నిధిలో గురుఎవారం విశేషపూజలు నిర్వహించారు. దేవాలయ సమితి ట్రస్టు ఉపాధ్యక్షుడు, పురసభ సభ్యుడు ఎస్ వెంకటేశ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబరు 5 నుంచి జనవరి 15వరకు అయ్యప్ప భక్తాదులకు స్వామి సన్నిధిలో నిరంతరం అన్నదాసోహం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అయ్యప్పస్వాములనుంచి ఎలాంటి నగదు డిమాండ్ చేయడం లేదన్నారు. అయితే భక్తులు స్వచ్ఛందంగా కానుకలు ఇస్తే ట్రస్టు తరపున రసీదు ఇస్తున్నామన్నారు. ట్రస్టు సభ్యులు, భక్తుల సహకారంతో ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రివేళ అన్నదానం, భజన, కన్యపూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 45ఏళ్లగా విజయవంతంగా నిర్వహిస్తున్నామని వచ్చే ఏడాది కుంభాభిషేకం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షుడు గోవింద, గురుస్వాములు సెల్వం స్వామి, అయ్యప్ప స్వామి, నారాయణస్వామి, ట్రస్టు సభ్యుడు హేమంత్, సోమశేఖర్, సతీశ్ బాబు, రమేశ్, వెంకటాచలపతి గౌడ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామికి విశేషపూజలు

వేరుశనగ విత్తన కొరత..!

- జిల్లాకు 7,635 క్వింటాళ్ల విత్తనాల కేటాయింపు
- 12 వేల హెక్టార్లకే సరిపోతాయంటున్న రైతులు
- 19 వేల హెక్టార్లలో సాగుకు సిద్ధం
- మార్కెట్‌లో అధిక ధరకు కొంటున్న రైతులు
- అవసరమైనంత విత్తనాలు ఇవ్వాలని వినతి

మడకశిర, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రబీలో బోరు, బావులు కింద రైతులు వేరుశనగ పంట సాగు చేసేందుకు వీలుగా ప్రభుత్వం సబ్సిడీతో విత్తనకాయలను పంపిణీ చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో సగానికి పైగా రైతులు బోరు, బావుల కింద వేరుశనగ సాగు ,చేశారు. వర్షాబావ కారణంగా రెండు సంవత్సరాలుగా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో సాగు విస్తీర్ణం కూడా తగ్గుతూ వచ్చింది. దీంతో నార్మల్ ఏరియా కూడా తగ్గుతూ వచ్చింది. ఈ రెండు, మూడు నెలలుగా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భజలాల పెరిగాయి. దీంతో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. ఇంతకాలం బీడుగా వదిలిన భూములను కూడా సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ పంట దెబ్బతింది. దీంతో అందరూ రబీపై ఆశలు పెంచుకున్నారు. అయితే వారిని విత్తన వేరుశనగ పీడిస్తోంది. ప్రభుత్వం రబీలో బావుల కింద వేరుశనగ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీతో వేరుశనగ పంపిణీ చేస్తోంది. అయితే నిబంధనలు ప్రకారం అర ఎకరాకు 30 కేజీల బస్తా, ఎకరాకు రెండు బస్తాలు, ఎకరా పైబడిన రైతులకు మూడు బస్తాల వేరుశనగను మాత్రమే పంపిణీ చేస్తున్నారు. దీంతో కొంత మంది రైతులు మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేయలేక.. అర, ఎకరాలోనే సాగు చేయడానికి సిద్ధమయ్యారు. ఇక రెండు, మూడు ఎకరాలో సాగు చేసే రైతులు బయట మార్కెట్‌లో విత్తనకాయలు కొనగోలు చేయాల్సి వస్తోంది. మార్కెట్‌లో నాణ్యమైన వేరుశనగ క్వింటాళ్లు రూ.8000 నుంచి రూ8500 వరకు పలుకుతోంది. నిబంధనలు సడలించి వేరుశనగను పంపిణీ చేస్తే పూర్తి స్థాయిలో బోరు బావుల కింద వేరుశనగ సాగు చేస్తామని రైతులు అందుతున్నారు. ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వేరుశనగను పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

ఐదు మండలాలకు 2,050 క్వింటాళ్లు

నియోజక వర్గంలోని ఐదు మండలాలకు 2,050 క్వింటాళ్ల వేరుశనగను కేటాయించారు. క్వింటా వేరుశనగ ధర రూ.9600 కాగా, సబ్సిడీ రూ.3840 పోను.. రైతుకు ప్రభుత్వం రూ.5760లకు విక్రయిస్తుస్తోంది. రైతు ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు తప్పని సరిగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు మడకశిర ప్రాంతంలో 2400 ఎకరాల వరకు వేరుశనగ సాగు చేశారు.

భార్యను కిరాతకంగా హతమార్చి స్టేషన్‌లో లొంగుబాటు

- మైసూరు జిల్లాలో ఘటన

బెంగళూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం చేసుకున్న భర్త గొడవపడి భార్యను కిరాతకంగా హత్య చేసిన సంఘటన మైసూరులో చోటు చేసుకుంది. లక్ష్మీకాంతనగర్‌లో భార్య శృతి (28)ను కిరాతకంగా గొంతుకోసి హత్య చేసి ఆపై నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. టైల్స్ దుకాణంలో పనిచేసే అరుణ్‌కు అగ్రహారకు చెందిన శృతితో ఐదేళ్లక్రితం వివాహమైంది. ఆరంభంలో అన్యోన్యంగా ఉన్నా ఇటీవల కొన్ని రోజులుగా విబేధాలు తలెత్తాయి. బుధవారం భార్యాభర్తల మధ్య గొడవ చోటు చేసుకోగా ఆవేశంలో భర్త మను చాకుతో భార్యపై దాడి చేసి హతమార్చాడు. అనంతరం హెబ్బాళ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కత్తితో నరికి.. హత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ పాండురంగ, సీఐ దయానంద్ తదితరులు

బంగారపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బంగారపేట్ట పట్టణంలోని బస్టాండ్ వెనుకభాగాన చికెన్ దుకాణం వద్ద ఒక వ్యక్తిని కత్తితో నరికి హతమార్చిన సంఘటన బుధవారం రాత్రి 8.30 గంటలకు చోటు చేసుకుంది. బంగారపేట తాలూకా కీసరనహళ్ళి నివాసి సురేశ్ (31) హత్యకు గురైన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఇంటికి వెళ్లేందుకు బైక్ స్టార్ చేస్తున్న తరుణంలో గుర్తు తెలియని వ్యక్తి వెనుకనుంచి కత్తితో తలపైదాడి చేసినట్టు తెలుస్తోంది. దీంతో రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న కేజీఎఫ్ జిల్లా డీఎస్పీ పాండురంగ, బంగారపేట పోలీసులు పరిశీలించారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదని దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ దయానంద్ తెలిపారు.

ఆస్తి కొనేముందు పరిశీలించుకోవడం ఉత్తమం

బెంగళూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నివాసం కోసం ప్లాట్‌తోపాటు ఎటువంటి ఆస్తులనైనా కొనుగోలు చేసేముందు డిజిటల్ రూపంలో కాకుండా వ్యక్తిగతంగా పరిశీలించుకోవడం ఉత్తమమని మ్యాజిక్‌బ్రిక్స్ సీఈఓ సుధీర్‌పై అభిప్రాయపడ్డారు. నగరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరు నెలల్లో సైట్ విజిట్ విధానం ఆరంభించామని 7,500మంది స్పందించి స్వయంగా పరిశీలించారన్నారు. 400మంది నివాసాలను బుక్ చేసుకున్నారన్నారు. నగరంలో వందకుపైగా బిల్డర్‌లకు సంబంధించిన నిర్మాణాలలో మ్యాజిక్‌బ్రిక్స్ సంస్థ పర్యవేక్షిస్తోందన్నారు. డిజిటల్ రూపంలో మోసాలు పెరిగాయని, స్వయంగా పరిశీలించు కోవడం ద్వారా అక్కడి నాణ్యతతోపాటు ప్రాపర్టీ అడ్వైజర్ సలహాలు తీసుకోవచ్చునన్నారు. సమీపంలో ఉండేవారితో ఆస్తికి సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు వీలుందన్నారు. మ్యాజిక్‌బ్రిక్స్ ద్వారా హోంలోన్, ఇంటీరియర్ లోన్‌లకు అవకాశం కల్పిస్తున్నా మన్నారు. రానున్న రోజుల్లో సైట్ విజిట్ ప్రాడక్ట్‌ను విస్తరించడం ద్వారా సొంతింటికలం సాకారం చేసుకునేవారికి అనుకూలం కానుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి





ఉమా వినోద్(ఫైల్)

పావగడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుమకూరు నగరంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పావగడ తాలూకా బొమ్మతనహళ్లికి చెందిన ఉమా(58), వినోద్(24) అనే యువ ఇంజనీయర్లు మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. పావగడ పట్టణంలోని జెమిని స్టూడియో యజమాని రమేష్ కుమారుడు వినోద్, దాబాస్ పేటలో గత నాలుగు నెలల నుండి ఇంజనీయర్‌గా పనిచేస్తూ తుమకూరులోని తన బంధువుల ఇంటికి వచ్చి వెళ్లేవాడు. పావగడ నుండి బుధవారం సాయంత్రం వినోద్‌కు పెద్దమ్మ వరసైన ఉమా ఒక శుభ కార్యం కోసం తుమకూరుకు వెళ్లింది. అక్కడ యల్లాపూర్‌లోని తమ బంధువుల ఇంటికి వినోద్ వెంట ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గుర్తుతెలియని వాహనం వారిని బలంగా ఢీకొంది. దీంతో వారు అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల కన్నీటిని ఆపడం ఎవరితరం కాలేదు. ఈ ఘటన ఆగ్రామం అందటినీ కంటతడి పెట్టించింది.

బాల్య వివాహంపై కేసు నమోదు

రాప్తాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు, రాప్తాడు మండలం మరూరు గ్రామానికి చెందిన ఓ యువకుడితో వివాహం చేసిన ఘటనకు సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. గురువారం ఆయన విలేకరులకు తెలిపిన మేరకు.. బుధవారం బాలికకు, యువకుడికి మండలంలోని హంపాపురం గ్రామంలోని శివాలయంలో వివాహం జరిపించారు. ఈ విషయాన్ని స్థానికులు చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించారు. ఐసీడీఎస్ చైల్డ్‌లైన్ సిబ్బంది ఫిర్యాదు చేయడంతో బాలిక తల్లిదండ్రులు, యువకుడు, యువకుడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేశామన్నారు.